గృహనిర్మాణాలు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర-తెనాలి: తెనాలి మండల పరిధిలోని పెదరావూరు, నేలపాడు, బుర్రిపాలెం జగనన్న లేఔట్‌లలో జరుగుతున్న గృహనిర్మాణాలను వేగవంతం చేయాలని తెనాలి నియోజకవర్గ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అధికారులకు, కాంట్రాక్టర్లకు గురువారం జరిగిన సమావేశంలో ఆదేశించారు. వైసీపీ ప్రభుత్వం పేదప్రజలకు అండ దండలుగా నిలిచిందని గృహనిర్మాణాలు త్వరిత గతిని పూర్తి చేసి వారికి అప్పగించడం మన విధిగా పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్నడూ లేనంతగా నిరుపేదలకు ఈ ప్రభుత్వం సహాయం చేస్తున్న సంగతి ప్రజలు గుర్తించాలన్నారు. కొంతమంది లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారని వాటిని ఎవరూ నమ్మవద్దని శివకుమార్ పేర్కొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై విస్తృత ప్రచారం

+ నేటి నుంచి ప్రచార యాత్ర
+ సీపీఐ, సీపీఎం

విశాలాంధ్ర-గుంటూరు: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 14న అంబేద్కర్ జయంతి నుంచి 30వ తేదీ వరకు విస్తృతంగా ప్రచారం చేయనున్నట్లు సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు జంగాల అజయ్‌కుమార్, పాశం రామారావు తెలిపారు. స్థానిక బ్రాడీపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ప్రజా వ్యతిరేక విధానాలను అమలు జరుపుతోందన్నారు. నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలు పెద్దఎత్తున పెంచిందన్నారు. మరో వైపు పేదలకు ఉపాధి లేక జీవన ప్రమాణాలు తగ్గిపోయి ప్రజలు దుర్భర జీవితాలు గడుపుతున్నారన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, పోలవరం ప్రాజెక్టుకు నిధులు, రైల్వే జోన్‌కు నిధులు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి బడ్జెట్‌లో కేటాయింపులులేవన్నారు. రాజధాని అభివృద్ధికి నిధులు కేటాయించలేదన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు పట్టుకొమ్మలుగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా అదానీ, అంబానీలకు కట్టబెడుతున్నారని విమర్శించారు. భారత రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధంగా రాష్ట్రాల హక్కులను కాలరాస్తుందని మండిపడ్డారు. గవర్నర్ వ్యవస్థను వినియోగించుకుని రాష్ట్రాలపై పెత్తనం చేస్తున్నదని, దళితులు, మైనార్టీలు, గిరిజనులపై దాడులు, మహిళలపై అత్యాచారాలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రం బాటలోనే పయనిస్తుందన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపు, వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు బిగింపు దీనిలో భాగమేనన్నారు. రాష్ట్రంలో ప్రజా ఉద్యమాలపై నిర్బంధం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఇతర అసంఘటిత రంగ కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా ఉద్యమాలపై పోలీసు నిర్బంధాన్ని ప్రయోగిస్తుందన్నారు. మూడు రాజధానుల పేరుతో రాజధాని రైతులకు ద్రోహం చేస్తుందని చెప్పారు.

ఈ విధానాలకు వ్యతిరేకంగా జిల్లాలో పెద్దఎత్తున ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. పాదయాత్రలు, గ్రూప్ సమావేశాలు, బహిరంగ సభలు నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు, నాయకులు ఎం.బాలాజి, సీపీఐ జిల్లా నాయకులు మేడా హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
గుంటూరు జిల్లా

కేఎల్‌యూ విద్యార్థినికి ఎన్‌సీసీ అవార్డు

విశాలాంధ్ర-తాడేపల్లి: కేఎల్ విశ్వవిద్యాలయంలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న యశ్విని అనే విద్యార్థినికి ఎన్‌సీసీ పురస్కారం లభించింది. ఎన్‌సీసీ వారు నిర్వహించిన అన్ని రకాల కార్యక్రమాలకు క్రమం తప్పకుండా హాజరవుతూ డ్రిల్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను యశ్వినికి ఈ పురస్కారం లభించినట్లు విశ్వవిద్యాలయ విద్యార్థి సంక్షేమ విభాగ అధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. గంటూరు, ప్రకాశం, నెల్లూరు వంటి మూడు జిల్లాల పరిదిలో కేవలం ఇద్దరికి మాత్రమే ఈ పురస్కారం లభించిందన్నారు. ఆ ఇద్దరిలో ప్రథమంగా తమ వర్సిటీకి చెందిన యశ్వినికి ఈ పురస్కారం లభించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ప్రో చాన్సలర్ డాక్టర్ కేఎస్ జగన్నాథరావు, వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకట రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, ఎం.హెచ్ ఎస్.డీన్ డాక్టర్ ఎం.కిషోర్ బాబు, విద్యార్థుల సంక్షేమ విభాగ అధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు, సాక్ అసోసియేట్ డీన్ డాక్టర్ కె.రూత్ రమ్య, ఎన్‌సీసీ అధికారిణి పావని, సమన్వయకర్త జి.చంద్రశేఖర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య పోరులో జలియన్ వాలాబాగ్ కీలకఘట్టం

విశాలాంధ్ర-గుంటూరువైద్యం: భారతదేశంలో శ్వేత జాతీయుల పాలనకు చరమ గీతం పలకటానికి భారతీయుల్లో స్వాతంత్ర్య కాంక్ష పెరగటానికి జలియన్ వాలాబాగ్ ఉదంతం నాంది ప్రస్తావన పలికిందని విశ్లేషకులు ఎంవీఎస్ ప్రసాదరావు అన్నారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో 'జలియన్ వాలాబాగ్ దుర్దినం'పై మేధావులు, విశ్లేషకులు గురువారం ప్రసంగించారు. ఆంగ్లేయుల దమనకాండకు శాశ్వత చిహ్నంగా అమాయకుల రుధిర ధారలతో తడిసిన జలియన్ వాలాబాగ్ చరిత్రలో మిగిలిపోయిందని ప్రశంసించారు. జలియన్ వాలాబాగ్ సంఘటన భారత స్వాతంత్ర్య మహోద్యమానికి ఊపిరిపోసిందని కొనియాడారు. విద్యావేత్త ఇ.చంద్రయ్య మాట్లాడుతూ 1919, ఏప్రిల్ 13న పంజాబ్ రాష్ట్రంలోని అమృతసర్‌లో గల స్వర్ణ దేవాలయం పక్కన ఉన్న జలియన్ వాలాబాగ్ తోటలో ఆంగ్లేయుల పాలనను వ్యతి రేకిస్తూ వివాదాస్పద రౌలట్ చట్టం కింద అనేక మంది నిర్బంధించటాన్ని ఖండిస్తూ ఇరవై వేలమంది ప్రజలు సమావేశమయ్యారన్నారు. కొండా శివరామిరెడ్డి, అచ్యుత ఇందుశేఖర్, సింగరయ్య, వెంకటరత్నంలు కూడా ప్రసంగించారు.

అంబేద్కర్ ఆలోచనలే సీఎం ఆశయాలు: లేళ్ల

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచనలే ఆశయాలుగా చేసుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ముందుకు సాగుతున్నారని ఎమ్మెల్సీ, పార్టీ కేంద్ర కార్యాలయం పర్యవేక్ష కులు లేళ్ళ అప్పిరెడ్డి తెలిపారు. అంబేద్కర్ రాజ్యాంగంలో ఏదైతే నిర్దేశించారో దాన్ని తూ.చ. తప్పకుండా అమలు చేస్తూ వివక్షతకు గురైన వర్గాలు, పేదరికంలో మగ్గుతున్న వర్గాలు, అణగారిన వర్గాలు తమ తలరాతలు తామే రాసుకునేవిధంగా సీఎం జగన్ పరిపాలన అందిస్తున్నట్లు అప్పిరెడ్డి వెల్లడించారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ విభాగం జిల్లా నేత పేటేటి నవీన్ (బాజి) ఆధ్వర్యంలో గురువారం బొంగరాలబీడులో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ బత్తుల దేవానంద్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య తదితరులతో కలిసి ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి ప్రారంభించారు. నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు, పార్టీ నేతలు రెడ్డి కోటేశ్వరరావు, రబ్బానీ, ఆలా కిరణ్, విద్యార్థి, ఎస్సీ విభాగం నేతలు విఠల్, రవి, ప్రశాంత్, హర్ష, బాలు, చంటి, అజయ్ పాల్గొన్నారు.

సాయిబాబా మందిరానికి వెండి సింహాసనం

విశాలాంధ్ర-పొన్నూరు: నిడుబ్రోలు శ్రీ షిరిడి సాయిబాబా మందిరానికి రూ.18 లక్షల విలువ కలిగిన వెండి సింహాసన బహుకరణ పాలేటి శ్రీనివాస చౌదరి తనూజ దంపతులు కుమారుడు కుమార్తెలు సాయి రాజీవ్, సాయి చరిత మామగారైన నన్నపనేని ప్రసాదరావు కుటుంబం తరపున గురువారం అందజేశారు. శ్రీ రాజ రాజేశ్వరి కళ్యాణమండపం, శ్రీ షిరిడి సాయిబాబా మందిర కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వెంకట పద్మజకు సన్మానం

విశాలాంధ్ర-తెనాలి: ఎన్‌టీఆర్ శత జయంతి పురస్కరించుకొని తెనాలి పెమ్మసాని థియేటర్లో గురువారం ప్రముఖ కళాకారిణి, సంకీర్తనా పరులు యల్లాప్రగడ వెంకట పద్మజను కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించారు. టీడీపీ నాయకురాలు వాసిరెడ్డి సులోచన, కొక్కిలిగడ్డ సీతామహాలక్ష్మి, జక్కా పరమేష్, గిరీశం, చంద్ర, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

30న తెనాలిలో అన్నమయ్య పాటల పోటీలు

విశాలాంధ్ర-తెనాలి: తెనాలిలోని శ్రీవాసవీ అమ్మవారి ఆలయ ప్రాం గణంలో గీతా మందిరంలో ఏప్రిల్ 30 ఆదివారం ఉదయం అన్నమయ్య పాటల పోటీలు జరుగునని నిర్వా హక కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు గురువారం జరిగిన విలేకర్ల సమా వేశంలో తెలిపారు. 6సం॥ నుంచి 60సం॥లలోపు వారు ఈ పోటీలలో పాల్గొన వచ్చుని, వారిలో నాలుగు కేడర్లలో పోటీలు జరుగుతాయని, విజేతలకు బహుమతులు, తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనం ఏర్పాటు చేస్తామని చెప్పారు. పాల్గొనేవారు ఈ నెల 25 లోగా 9246440685 చరవాణిలో తమ వివరాలు తెలిపి పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. ఏ-గ్రేడ్ మృదంగ విద్వాంసులు కానూరి వెంకట రామకృష్ణ, కౌన్సిలర్ హరేరాం, ఎల్ లక్ష్మణరావు, రత్నకుమారి పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంట్‌పై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: ముప్పై రెండు మంది పోరాట యోధుల బలిదానంతో సాధించుకున్న విశాఖ ఉక్కును కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్‌పరం చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం నిస్సహాయంగా చూడటం సరికాదని, ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం వెంటనే స్పందించి తగు నిర్ణయం తీసుకోవాలని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం అవగాహన సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రుల మనోభావాలతో ముడిపడిన ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేసేందుకు కేంద్రం వడివడిగా అడుగులు వేస్తుంటే ఆపే సత్తా రాష్ట్ర ప్రభుత్వానికి లేదా? అని ప్రశ్నించారు. కనీసం పొరుగు రాష్ట్రమైన తెలంగాణ ప్రభుత్వానికి, అక్కడి నాయకులకు ఉన్న శ్రద్ధ, తపన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు లేకపోవటం సిగ్గుచేటని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ భవితవ్యంపై తక్షణమే స్పందించి కార్యాచరణ ప్రకటించాలని అవగాహన సంస్థ డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రజా నాయకుడు గోగినేని సూర్యం: ముప్పాళ్ల

విశాలాంధ్ర-గుంటూరు: ప్రజా సమస్యలను వెలికి తీయడం వాటి పరిష్కార దిశగా పోరాటాలు రూపొందించడం, అనేక సమస్యల పరిష్కారంలో విజయం సాధించిన గొప్ప చరిత్ర కలిగిన ప్రజానాయ కుడు గోగినేని సూర్యం అని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. గుంటూరు పట్టణ సీపీఐ మాజీ కార్యదర్శి, కార్మిక నాయకులు గోగినేని సూర్యం 21వ వర్ధంతి సభ సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో గుంటూరు మల్లయ్య లింగంభవన్‌లో గురువారం జరిగింది. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ అనునిత్యం కార్మికుల సమస్యలపై పోరాటాలు నిర్వహించి, అనేక విజయాలు సాధించిన కార్మిక పక్ష నేత కామ్రేడ్ గోగినేని సూర్యం అని వారు కొనియాడారు. సూర్యం చూపిన బాటలో సమసమాజ స్థాపన దిశగా మనమందరం కొనసాగాలని వారు పిలుపునిచ్చారు. ఇస్కా జాతీయ కార్యదర్శి గని, సీనియర్ నాయకులు నూతలపాటి చిన్న, నగర కమిటీ సభ్యులు జి.సురేష్ బాబు, ఆకిటి అరుణ్ కుమార్, రావుల అంజిబాబు, చల్లా మరియదాసు, చిన్నపోతుల విజయకుమార్, నగర సమితి సభ్యులు చినబోతుల శీను, బందెల రవికుమార్, తిరుమల, మహేంద్ర, సాయి, జగన్నాథం, నారాయణ, దానియేలు, కొండలు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ మ్యాపింగ్ త్వరితగతిన పూర్తి : కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: జిల్లాలో ఓటుకు ఆధార్ మ్యాపింగ్ త్వరితగతిన పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ వేణుగోపాల రెడ్డి అన్నారు. ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు, ఎన్నికలు సజావుగా జరిగేందుకు స్టాండర్డ్ ఆపరేటింగ్ సిస్టం ఏర్పాటుకు చర్యలు, పెండింగ్ ఎన్నికల అంశాలు, ప్రింటింగ్ ఆఫ్ పివిసి ఎపిక్ కార్డులు ప్రింటింగ్ సరఫరా, సంబంధిత ఓట రుకు స్పీడ్ పోస్ట్ ద్వారా పంపడం రానున్న సార్వత్రిక ఎన్నికలలో అనుసరించాల్సిన విధివిధానాలపై గురువారం సచివాయలం నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలక్టరేట్ వీసీ హాల్ నుండి కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ రాజ కుమారి, కమిషనర్ కీర్తి చేకూరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈపి రేషియో, జెండర్ రేషియో అంశాలను వివరించారు. ఓటరు జాబితాలో 18 సంవత్సరాల నుండి 19 సంవత్సరాల వయస్సు ఉన్న వారిని నమోదుకు తగు చర్యలు చేపడతామని, పివిసి ఎపిక్ కార్డులు ప్రింటింగ్ ఏజెన్సీ నుండి అందిన వెంటనే అందిన వాటిని స్పీడ్ పోస్ట్ ద్వారా సంబంధిత ఓటరుకు పంపడం జరుగుతుందని తెలిపారు. ఫారం 6, 6 ఏ, 7, 8 లకు సంబంధించి క్లైమ్ లు, అభ్యంతరాలు పరిష్కరించడానికి ఏఈఆర్‌ఓలు, ఈఆర్‌ఓల పర్యవేక్షణలో ఎన్నికల కమిషన్ సూచించిన మార్గదర్శకాల ప్రకారం పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలింగ్ స్టేషన్ల వారీగా జెండర్ రేషియో పరిశీలిస్తామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్‌ఓ చంద్ర శేఖర రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వెంకట శివరామి రెడ్డి, లలితా, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మోవిడి వాణి, సాయిశ్రీ, ఆర్డిఓ ప్రభాకర రెడ్డి, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

TENALI MUNICIPALITY
E-procurement Shot Tender Notice

EPTC NIT No.24/2022-2023/GGMP (2nd call) & NIT No.1 & 2/ 2023-2024/ General Fund Online tenders are hereby invited from the contractors /contracting agencies for No. of Works : 3 for the amount of Rupees in Est Amount **Rs.18.71** Lakhs. The tender document is available for download from **Dt : 13-04-2023 (04.00pm)** onwards and last date for bid submission is **Dt : 24-04-2023 (4.30pm)** through Further details can be seen at 'e' procurement market Place i.e., **"www.apeprocurement.gov.in"**

COMMISSIONER, TENALI MUNICIPALITY

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు

ఆర్.ఓ.సి.నెం.763/03/2023/ఇ1 తేది: 13-04-2023

నిట్ నెం.05/జె.టి.ఓ/2023-24

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ - నగరపాలక సంస్థ సాధారణ నిధుల క్రింద మొత్తము 24 పనులకు ఈ దిగువ ఉదహరించిన తేదీల యందు ఇ-ప్రోక్యుర్మెంట్ ద్వారా టెండరు పిలువబడినది.

మొత్తము పనులు - 24 నెం.లు పని నెం. 01 నుండి 19 లకు :	అంచనా వ్యయము రూ.281.45 లక్షలు
1. టెండరు షెడ్యూల్స్ డౌన్‌లోడ్ కొరకు నిర్ణయించిన ప్రారంభ తేదీ	: ది.14-04-2023 ఉదయము గం. 11.00 ని.ల నుండి
2. టెండర్ల షెడ్యూల్స్ డౌన్‌లోడ్ కొరకు నిర్ణయించిన చివరి తేది	: ది.21-04-2023 ఉదయము గం. 11.00 ని.ల వరకు
3. ప్రైస్ బిడ్ తెరుచు తేది	: ది.21-04-2023 మధ్యాహ్నము గం.2.00 ని.లకు
పని నెం. 20 నుండి 24 లకు :	
1. టెండరు షెడ్యూల్స్ డౌన్‌లోడ్ కొరకు నిర్ణయించిన ప్రారంభ తేదీ	: ది.14-04-2023 ఉదయము గం. 11.00 ని.ల నుండి
2. టెండర్ల షెడ్యూల్స్ డౌన్‌లోడ్ కొరకు నిర్ణయించిన చివరి తేది	: ది.17-04-2023 ఉదయము గం. 11.00 ని.ల వరకు
3. ప్రైస్ బిడ్ తెరుచు తేది	: ది.17-04-2023 మధ్యాహ్నము గం.2.00 ని.లకు

మిగతా వివరములకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ http://www.apeprocurement.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు. మొబైల్ నెం.9849907303

సం/- యు.శారదా దేవి, కమిషనరు
మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ

నేటి నుంచి సీపీఐ-సీపీఎం ప్రచారభేరి ప్రారంభం

విశాలాంధ్ర-గుంటూరు: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిరంకుశ పాలనపై ఈ నెల 14వ తేది నుంచి తలపెట్టిన సీపీఐ-సీపీఎం ప్రచార భేరి కార్యక్రమాలను జయప్రదం చేయాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, సీపీఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు గుంటూరు నగరంలోని 14వ తేది నుంచి 30వ తేది వరకు జరిగే ప్రచార యాత్ర షెడ్యూల్‌ను విడుదల చేశారు. 14వ తేదిన స్థానిక హరిహర మహల్ సెంటర్ ట్యాంకుల రోడ్డులో ప్రారంభ సభ అనంతరం లాడ్జిసెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ప్రచార యాత్ర ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. 15వ తేదిన పాతగుంటూరు ప్రాంతంలో పాదయాత్ర, 16న పాతగుంటూరు పార్కు సెంటర్‌లో సాయంత్రం బహిరంగ సభ, 17న గుజ్జనగుండ్ల ప్రాంతంలో పాదయాత్ర, సాయంత్రం పార్కు సెంటర్‌లో బహిరంగ సభ, 18న శారదాకాలనీలో పాదయాత్ర సాయంత్రం ఆర్చి సెంటర్‌లో బహిరంగ సభ, 19న అశోక్‌నగర్ ప్రాంతంలో పాదయాత్ర సాయంత్రం కోబాల్ట్‌పేటలోని అంబేద్కర్ సెంటర్‌లో బహిరంగ సభ, 20న చాకలిగుంట ప్రాంతంలో పాదయాత్ర, సాయంత్రం బొమ్మల సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వివరించారు. అదేవిధంగా 23న నెహ్రూనగర్‌లో పాదయాత్ర, సాయంత్రం వెంకటాద్రిపేటలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వివరించారు. 24న ఏటీ అగ్రహారం ప్రాంతంలో పాదయాత్ర, సాయంత్రం బోరింగ్ పంపు సెంటర్ వద్ద బహిరంగ సభ, 25న స్వర్ణభారతినగర్‌లో పాదయాత్ర, సాయంత్రం న్యూ ఆర్డీఓ ఆఫీస్ వద్ద బహిరంగ సభ, 27న మంగళదాస్‌నగర్‌లో పాదయాత్ర సాయంత్రం బహిరంగ సభ, 30న గడ్డిపాడు ప్రాంతంలో పాదయాత్ర, సాయంత్రం మెయిన్‌రోడ్డులోని సీపీఐ జెండా దిమ్మె వద్ద ముగింపు సభ జరుగుతుందని, ఆయా తేదీలలో జరిగే కార్యక్రమాలలో పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

దుగ్గిరాల: మండల కేంద్రమైన దుగ్గిరాలలో సీపీఎం కార్యాలయంలో గురువారం సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ప్రచార భేరి జరుగుతుందని తెలియజేశారు. శుక్రవారం జరిగే అంబేద్కర్ జయంతి రోజున ప్రచార భేరిని ప్రారంభిస్తామని తెలిపారు. సీపీఐ, సీపీఎం నాయకులు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ప్రతి వ్యక్తి గొంతెత్తి కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను నిలదీయాల్సిన సమయం వచ్చిందని తెలిపారు. అదానీ, అంబానీ లాంటి అతిసంపదలకు దేశ సంపదను దోచిపెడుతున్నదని, ప్రశ్నించే ప్రతిఒక్కరిని నిరంకుశంగా అణచివేస్తున్నారని తెలిపారు. కేంద్రంలో రాష్ట్రంలో పెరిగిపోతున్న పెట్రోల్, డీజిల్ ధరలు, మన బతుకుల్లో మంటలు రాజేస్తున్నాయని, ధరలు కొండెక్కాయన్నారు. మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య, మండల కార్యదర్శి జలాది జాన్ బాబు, సీపీఎం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు, గ్రామ కార్యదర్శి షేక్ కరీముల్లా, వల్లభనేని సాంబశివరావు, యోగేశ్వరరావు బ్రహ్మేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

పెదకాకాని: ఉభయ కమ్యూనిస్టు సీపీఐ, సీపీఎం పార్టీల జాతీయ సమితి పిలుపుమేరకు పెదకాకాని సెంటర్‌లో గురువారం గోడపత్రిక ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి పొన్నూరు నియోజకవర్గ సీపీఐ పార్టీ కార్యవర్గ సభ్యులు కేతినేని అగస్టిన్ అధ్యక్షత వహించారు. పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ, పెదకాకాని మండల కార్యదర్శి నన్నపనేని శివాజీలు మాట్లాడుతూ గత 9 సంవత్సరాల పరిపాలనలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వ ఆధ్వర్యంలో భారతదేశంలో 9 కోట్ల మంది పేదలుగా ఉన్న దేశంగా నిలిచిందన్నారు. నిరుద్యోగులు ఎక్కువగా ఉన్న దేశంగా ప్రపంచంలో ప్రసిద్ధికెక్కిం దన్నారు. ప్రపంచ వ్యాప్తంగా చమురు ధరలు తగ్గితే భారతదేశంలో అధిక ధరలకు అమ్ముతున్నారన్నారని, రైతులపై పార్లమెంట్ సాక్షిగా ఊకదంపుడు మాటలు చెప్పి ఏమి చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో జగన్, కేంద్రంలో మోడీ ప్రతిపక్ష పార్టీల నోరు నొక్కుతున్నారని, విభజించు పాలించు అన్న రీతిలో బీజేపీ ప్రధానమంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన చేయడం సిగ్గుమాలిన చర్య అని ఖండించారు. ఉభయ కమ్యూనిస్టు సీపీఐ, సీపీఎం పార్టీల ఆధ్వర్యంలో ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతిన ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించి గ్రామ గ్రామాల్లోకి వెళ్లి ప్రచారం నిర్వహించి ప్రజలను చైతన్యపరుస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బట్టు నాగేశ్వరరావు, గోపి, మధు, మోహన్, గోపి, శివ చైతన్య, అమరయ్య, జిలేబి రవి తదితరులు పాల్గొన్నారు.

బ్లాసమ్స్ హాస్పిటల్‌లో బాలుడికి అరుదైన చికిత్స

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: గుంటూరు బ్లాసమ్స్ మదర్ అండ్ చైల్డ్ హాస్పిటల్ అధినేత, ప్రముఖ పీడియాట్రిక్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ మేకల నాగ సుధీర్‌కుమార్ రెడ్డి, హాస్పిటల్ వైద్యులు 7సంవత్సరాల బాలుడికి ఎంతో క్లిష్టమైన చికిత్స చేసి విజయవంతంగా ఆ బాలుడి ప్రాణాలు కాపాడారు. వివరాల్లోకి వెళితే....ఒంగోలుకు చెందిన ఆటో డ్రైవర్‌కు 7 సంవత్సరాల శుశాంత్ అనే కుమారుడు ఉన్నాడు. అతనికి జ్వరం, జలుబు, దగ్గు, వాంతులతో కిడ్నీలు పని చేయకపోవడంతో పలు హాస్పిటల్స్‌లో బాలుడికి చికిత్స చేయించారు. ఫలితం లేకపోవడంతో గుంటూరు బ్లాసమ్స్ మదర్ అండ్ చైల్డ్ హిస్పటల్‌ను ఆశ్రయించారు. దీంతో హాస్పిటల్ అధినేత డాక్టర్ నాగర సుధీర్‌కుమార్ రెడ్డి బాలుడి పరిస్థితి చూసి తక్షణమే వివిధ పరీక్షలు చేశారు. వైద్య రంగంలో దీనిని హెపటోరీనల్ సిండ్రోమ్ విత్ హెపాటిక్ ఎంకెఫలోపతె అని పిలుస్తారని డాక్టర్ పేర్కొన్నారు. ఇది చాలా అరుదైనదని, ఇటువంటి వ్యాధికి గురైన కొంతమంది బాలురలకు కాలేయ మార్పిడి చికిత్స చేయాల్సి వస్తోందని అన్నారు. అయితే ప్లాస్మా ఫెరసిస్ అనే ఆధునిక చికిత్సావ విధానంతో రక్తంలోని మలినాలను తొలగించి బాలుడిని కోమ దశ నుంచి బయటకు తీసుకురాగలిగారన్నారు. పిల్లల్లో వచ్చే ఇటువంటి అరుదైన వ్యాధిని బ్లాసమ్స్ హాస్పిటల్‌లో మొదటిసారిగా చేయడం చాలా ఆనందంగా ఉందని డాక్టర్ నాగ సుధీర్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ బాలుడి ఆరోగ్యం స్టేబుల్‌గా ఉండటంతో గురువారం డిశ్చార్జ్ అవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీయూ స్పెషలిస్ట్ డాక్టర్ రాధిక, ఎన్‌ఐసీయూ స్పెషలిస్ట్ డాక్టర్ హరీష్, డాక్టర్ సుధీర్‌కుమార్, హాస్పిటల్ ఎగ్జిక్యూటీవ్ మేనేజర్ బాష తదితరులు ఉన్నారు.

పసుపు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించండి

విశాలాంధ్ర-గుంటూరు: పసుపు కొనుగోలుకు కేంద్రాలను వెంటనే ప్రారంభించి క్వింటా పసుపు రూ.15 వేలకు కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ పసుపు రైతుల ఐక్య కార్యాచరణ కమిటీ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటురు జిల్లా సమితి నాయకులు కోరారు. ఈ మేరకు గుంటూరు జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారిని గురువారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ క్వింటా పసుపు కాయ ధర రూ.4100 నుంచి రూ.5 వేల లోపు మాత్రమే కొనుగోలు జరుగుతుందని, ఎకరానికి కౌలుతో పాటు రూ.1.50 లక్షల నుంచి రూ.1.80 లక్షల వరకు పెట్టుబడి పెట్టి పండించిన పంటకు మార్కెట్‌లో లభిస్తున్న ధరను బట్టి చూస్తే ఎకరానికి రూ.80 వేల నుంచి లక్ష రూపాయాల వరకు రైతులు నష్టపోతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, అధికారులు స్పందించి మద్దతు ధరల ప్రకారం పసుపు కొనుగోళ్ళను వెంటనే ప్రారంభించాలని, క్వింటా పసుపు రూ.15 వేలకు కొనుగోలు చేయాలని, ఇటీవల కురిసిన భారీ వర్షాల వలన కళ్ళాలలో ఉన్న పసుపు తడిసి నష్టపోయిన రైతుకు ఎకరానికి రూ.50 వేలు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. అదేవిధంగా పసుపు బోర్డును దుగ్గిరాలలో ఏర్పాటు చేయాలని, రైతు బంధు పథకాన్ని అమలు చేయాలని, మార్కెట్ యార్డుకు పసుపు అమ్మకానికి తెచ్చిన రైతులకు ఉచిత భోజన వసతి సదుపాయాన్ని కల్పించాలని కోరారు. జేసీని కలిసిన వారిలో పసుపు రైతుల ఐక్య కార్యాచరణ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు యార్లగడ్డ వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ, కౌలు రైతు సంఘం కోశాధికారి కంజుల విఠల్ రెడ్డి, రైతు సంఘం జిల్లా కోశాధికారి సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

విశాలాంధ్ర
పల్నాడు జిల్లా

మతోన్మాద బీజేపీని తరిమికొట్టండి

సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతివరప్రసాద్

విశాలాంధ్ర-యడ్లపాడు: దేశంలో మతోన్మాదంతో కరాళనృత్యం చేస్తున్న మోదీ, భారతీయ జనతా పార్టీలను తరిమికొట్టవలసిందిగా సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఏ.మారుతివరప్రసాద్ పిలుపునిచ్చారు. తుమ్మల పాలెం అమరవీరుల స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం 16వ నెంబర్ జాతీయ రహదారి ప్రక్కనే తుమ్మల పాలెం వద్ద గల అమర్‌నగర్‌లో జరిగిన అమరవీరుల సంస్మరణ సభలో మారుతి పాల్గొని ప్రసంగించారు. వేలూరు గ్రామ సర్పంచ్, సీపీఐ నాయకులు బొంతా తిరుపతయ్య అధ్యక్షతన జరిగిన ఈ సభలో మారుతి ప్రసాద్ పాల్గొని అమరుల సంస్మరణకు విప్లవ గీతాలాపన చేసి నివాళులర్పించారు. మారుతి మాట్లాడుతూ 2002లో గుజరాత్‌లో జరిగిన మారణకాండ సృష్టికర్తలు, పార్టీలే నేడు దేశాన్నిపాలిస్తూ మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నాయని తీవ్రంగా విమర్శించారు. పాలనా వైఫల్యాలను ప్రశ్నించే వారిని, విపక్షాలను ఉక్కుపాదంతో అణచివేస్తున్నారని, ఈడీ, సీబీఐలతో దాడులు చేయిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వామపక్షాలు, ఉద్యమ సంఘాలు సంఘటితంగా ఎదుర్కోవాలని లేకపోతే దేశ భవిష్యత్తు, కమ్యూనిస్టు పార్టీల ఉనికి ప్రశ్నార్థకంగా మారుతుందని స్పష్టంచేసారు. రాష్ట్ర విభజన సమయంలో రాష్ట్రానికి ఇస్తానన్న ప్రత్యేక హోదా ముగిసిపోయిన అధ్యాయంగా మోదీ చెప్పటం, విశాఖ రైల్వే జోన్ ఊసే ఎత్తకపోవడం దారుణమన్నారు. ఆనాడు తమిళనాడుకు వెళ్లే విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కమ్యూనిస్ట్ పార్టీలు, ప్రజలు సంఘటితంగా ఎదుర్కొని ఆంధ్ర హక్కుగా విశాఖలో నెలకొల్పేలా చేశారని, ఇప్పుడు దాన్ని అమ్మేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నడం దారుణమని వాపోయారు. నల్లధనాన్ని వెలితీస్తామన్న మాటలు నీటిమూటలు అయినాయని, కరోనాతో ప్రజలు అల్లాడుతుంటే మోదీ అండతో అదానీ, అంబానీ లాంటి వారి ఆస్తులు లక్షల కోట్లు పెరిగాయని తీవ్ర విమర్శలు చేశారు.

యువత ముందుకు రావాలి

సభలో మారుతి వరప్రసాద్ మాట్లాడుతూ విశ్లేషణాత్మక సూచనలు చేశారు. సభకు హాజరైన వారిలో ఎక్కువ మంది 60 నుంచి 70 సంవత్సరాల వయసు పైబడ్డవారేనని, యువకులు నామమాత్రంగా ఉన్నారని, కమ్యూనిస్టు ఉద్యమాలు బలహీనపడడానికి యువత ముందుకు రాకపోవడం ప్రధాన కారణమని విశ్లేషించారు. ప్రతిఒక్కరూ యువతను కార్యాచరణలోకి ఆహ్వానించాలని పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లా సీపీఎం సహ కార్యదర్శి వై.రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ పాలనలో ప్రశ్నించేవారు దేశద్రోహులని, అదానీ, మోదీ లాంటివారు దేశభక్తులుగా మారారని, వామపక్షాలు కలిసికట్టుగా ఉద్యమించి మతోన్మాద బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదింపాలని పిలుపునిచ్చారు. సీపీఐ ఎంఎల్ రాష్ట్ర నాయకులు జాస్తి కిషోర్ బాబు మాట్లాడుతూ ప్రకృతి విపత్తులను కూడా కేంద్ర ప్రభుత్వం తనకు అనుకూలంగా మార్చుకుంటూ కార్పొరేట్ వ్యవస్థలకు కొమ్ముకాస్తున్నారని, ఉక్రెయిన్ యుద్ధం వలన ధరలు పెరిగాయని వ్యాపారవేత్తల ఆస్తులు పెంచారని విమర్శించారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకురాలు ఎం.లక్ష్మీ మాట్లాడుతూ మీడియా, న్యాయ వ్యవస్థ ప్రజల విశ్వసనీయత కోల్పోయారని విమర్శించారు. సభలో సీపీఐ చిలకలూరిపేట ఏరియా కార్యదర్శి నాగభైరు రామసుబ్బాయమ్మ, రైతు సంఘం అధ్యక్షులు తాళ్లూరి బాబూరావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ సుభాని, ఏఐటీయూసీ ఏరియా అధ్యక్షులు పేలూరి రామారావు, కార్యదర్శి దాసరి వరహాలు, సీపీఎం నాయకులు పోపూరి సుబ్బారావు, జరుగుల శంకర్రావు, కారుచోల రోశయ్య తదితరులు పాల్గొన్నారు. ట్రస్ట్ కన్వీనర్ చెరుకూరి సత్యనారాయణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

నేటి నుంచి ప్రజా చైతన్య యాత్రలు

విశాలాంధ్ర-పెదకూరపాడు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ సమితి పిలుపుమేరకు ఈ నెల 14వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహించతలపెట్టిన ప్రజా చైతన్య యాత్రలను జయప్రదం చేయాలని పెదకూరపాడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాస రావు తెలిపారు. గురువారం 75 తాళ్లూరు సీపీఐ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఏకపక్షా నియంతృత్వ విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా నెలరోజుల పాటు ప్రజా చైతన్య యాత్రలకు సీపీఐ జాతీయ సమితి పిలుపునిచ్చిందన్నారు. రాష్ట్రంలో ఈ నెల 14 నుంచి 30 వరకు సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింటికి ప్రజా చైతన్య ప్రచార యాత్రలను నిర్వస్తున్నారన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై పన్నుల భారాలను మోపుతూ పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ నిత్యావసర ధరలు విపరీతంగా పెంచడంతోపాటు నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా తాత్సరం చేస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతూ దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతుందని మండిపడ్డారు. ముఖ్యంగా ప్రాణాలను త్యాగం చేసి సాధించుకున్న విశాఖ ఉక్కును కార్పొరేట్ కంపెనీలకు అప్పగిం చేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని అన్నారు. పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ పాదయాత్రలలో భాగంగా పెదకూరపాడు నియోజకవర్గంలోని అమరావతి, క్రోసూరు, అచ్చంపేట, బెల్లంకొండ, పెదకూరపాడులో జరిగే పాదయాత్రలో పెద్ద ఎత్తున కార్మికులు, కర్షకులు పాల్గొని విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు.

మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడిగా భీమారావు

విశాలాంధ్ర వినుకొండ: మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు శెట్టి భీమారావు అంబేద్కర్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లూధర బాబు , జిల్లా అధ్యక్షులు ముసుగు రవి, వైస్ ప్రెసిడెంట్ బాలు లా ఆదేశాల మేరకు కమిటీలు వేస్తున్న నేపథ్యంలో నియోజకవర్గ మాల మహానాడు వర్కింగ్ ప్రెసిడెంట్ గా దొప్పలపూడి రత్న బాబు యువత అధ్యక్షులుగా గుండా బత్తిన విజయరాజు లను నియమించినట్లు నియోజక వర్గ అధ్యక్షులు తుళ్లూరి బ్రహ్మం ఓ ప్రకటనలో తెలిపారు. వీరు నియోజక వర్గంలోని మాలల సమస్యలపై పోరాటం చేస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో చిట్టిబాబు, మాణిక్యరావు, భూషణం, జంగా శ్రీను, చిలగిలి ఏడుకొండలు, క్రాంతి కుమార్ పాల్గొని నూతనంగా ఎన్నికైన సభ్యులను అభినందించారు.

రెంటచింతలలో కారు దగ్ధం

విశాలాంధ్ర-రెంటచింతల: రెంటచింతల-గురజాల మార్గమధ్యలో గురువారం మధ్యాహ్నం ఓ ప్రవేట్ కారు దగ్ధం అయ్యింది. పోలీసుల కథనం ప్రకారం ఘటనా వివరాల ఇలా ఉన్నాయి. దాచేపల్లి నుండి వి.శ్యామ్ కుమార్ మరో ముగ్గురు రెంటచింతలకు కారులో వస్తున్నారు. కారు ముందు భాగం ఇంజన్ నుండి మంటలు రావడంతో ఆపి నల్గురు దిగారు. క్షణాలలో కారంతా మంటలు వ్యాపించాయి. ఘటనా స్థలాన్ని ఎస్సై సమీర్ భాషా పరిశీలించారు. ప్రయాణీతులు క్షేమంగా బయటపడటంలో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. కేసు పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇంజనులో ఏర్పడిన సాంకేతిక లోపం వల్లనే మంటలు వ్యాపించాయిని పోలీసులు భావిస్తున్నారు.

డిగ్రీ విద్యార్థికి యావజ్జీవ ఖైదు



విశాలాంధ్ర-నరసరావుపేట: ప్రేమ పేరుతో తోటి విద్యార్థినిని అపహరించి, అనుమానంతో దారుణంగా హత్య చేసిన డిగ్రీ విద్యార్థి మేడం విష్ణువర్ధన్ రెడ్డికి నరసరావుపేట 13వ అదనపు సెషన్స్ కోర్టు జీవిత ఖైదుతో పాటు రూ.2500లు జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పునిచ్చింది. నరసరావుపేట దిశ పోలీస్ స్టేషన్ డి.ఎస్.పి రవిచంద్ర తెలిపిన వివరాలు ప్రకారం 2021 ఫిబ్రవరి నెల 24వ తేదీన పట్టణంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో బిఎస్సి రెండో సంవత్సరం చదువుతున్న కోట అనూషను తోటి విద్యార్థి విష్ణువర్ధన్ రెడ్డి ప్రేమ పేరుతో ఆటోలో ఎక్కించుకొని ఊరి వెలుపల ఉన్న రావిపాడు రోడ్డు వైపు పొలాల్లోకి తీసుకువెళ్లి ఆమెతో గొడవపడి ఆమెను దారుణంగా హత్య చేసి మృతదేహాన్ని కనిపించకుండా చేసేందుకు గోవిందపురం మేజర్ కాలువలో పడేసాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు విద్యార్థిని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి 24 గంటల్లో ముద్దాయిని అరెస్ట్ చేశారు. అప్పటి పోలీసు ఉన్నతాధికారులు ఈ కేసును దిశా పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. అధికారిగా డిసైడ్ డి.ఎస్.పి రవిచంద్రన్ నియమించారు. ఈ కేసులో సమగ్రత జరిపి తగిన సాక్ష్యధారాలను సేకరించి కోర్టు ముందు ఉంచటంతో వాదోపవాదాలు విన్న న్యాయమూర్తి విష్ణువర్ధన్ రెడ్డికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పాతూరి మధుసూదన్‌రావు వ్యవహరించి వాదోపవాదాలు వినిపించారు.

రోగులకు ఆర్థికసాయం

విశాలాంధ్ర-తాడేపల్లి: ఎంటీఎంసీ పరిధిలోని మెల్లెంపూడి గ్రామానికి చెందిన కంచర్ల అర్లప్ప రోడ్డు ప్రమాదంలో గాయపడి (రెండు చేతులు, ఒక కాలు విరిగి) గవ్నమెంట్ హాస్పటల్‌లో చికిత్స పొంది బెడ్‌రెస్ట్‌లో ఉన్నారు. కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నారన్న సమాచారం స్థానిక నాయకుల ద్వారా ఎమ్మెల్యే ఆర్కే తెలుసుకున్నారు. వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి అండగా నిలిచేలా రూ.20వేలు ఆర్థిక సహాయాన్ని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుల ద్వారా గురువారం అందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కత్తిక రాఘవరావు, మున్నంగి వివేకానందరెడ్డి, వుయ్యూరు శివరామిరెడ్డి, బొమ్మరెడ్డి రాజా రామిరెడ్డి, ఈదులమూడి శేఖర్, రామకృష్ణా రెడ్డి(నాని), మొగల్ జలీల్, షేక్ అలంబుడె, నాగుల మీరా, ఈదులమూడి ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

మట్టి నామూనాల సేకరణ



విశాలాంధ్ర-దుర్గి: స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో గురువారం మండల వ్యవసాయాధికారి వై.అమీర్ రెడ్డి అధ్యక్షతన మండల స్థాయి భూసార పరీక్ష నమునాల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి అమీర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు తమయొక్క భూమిలో ఏఏ లోపాలు అనగా నత్రజని, ఫాస్ఫరం, పొటాషియం, సూక్ష్మ ధాతువులైన జింక్, బొరాన్, మిగ్నీషియం, మార్జివము, మాగ్ననీస్, ఐరన్ ఏ స్థాయిలో ఉన్నవి గుర్తించి, అవసరమైన మోతాదును పైపాటుగా మొక్కలపై పిచికారి చేసి అధిక దిగుబడులు సాధించాలని, ఎరువుల ఖర్చు తగ్గుతుందని సూచించారు. ఈకార్యక్రమంలో శిక్షణా నిపుణులు ఇ.అశోక్ మాట్లాడుతూ మట్టి నమునా శిక్షణను వివరించారు. ఈకార్యక్రమంలో రైతులు, ఆర్‌బికే ఇంచార్జీలు, విఎఏ, విహెచ్ఎ, ఎంపిఈఒలు పాల్గొన్నారు.

పసుపును ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

విశాలాంధ్ర-వినుకొండ: పల్నాడు జిల్లా వినుకొండ శివయ్య భవనంలో గురువారం రైతు సంఘం కార్యాలయంలో వెనిగళ్ళ బాలాజీ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము పాల్గొని మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో .అమరావతి. పెదకూరపాడు సత్తెనపల్లి అచ్చంపేట కోసూరు ముప్పాళ్ళ నరసరావుపేట రొంపిచర్ల అనేక గ్రామాల్లో పసుపు పంట రైతులు సాగు చేసి పండించి ప్రభుత్వం ఎమ్మెస్పీ ద్వారా కొనుగోలు చేయకపోవడంతో దళారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని వెంటనే ప్రభుత్వం పసుపు కొనుగోలు సెంటర్లు ఏర్పాటు చేసి ఏ ప్రాంతంలో పండిన పంటను ఆ ప్రాంతంలో ఎమ్మెస్పీ ధరకు కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని. అలాగే మొక్కజొన్న పంటను కూడా ఎమ్మెస్ పి ధరకు ఏ ప్రాంతంలో పండించిన పంటను ఆ ప్రాంతంలోనే కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అదేవిధంగా ఇటీవల కాలంలో కురిసిన వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇచ్చి ప్రభుత్వమే ఆదుకోవాలని ప్రకృతి వైపరీత్యాల వల్ల పిడుగులు పడి మరణించిన రైతులకు ఐదు లక్షల రూపాయలు ఎస్ గ్రేషియా ఇచ్చి ఆ కుటుంబాలను ప్రభుత్వ ఆదుకోవాలని ఆ కుటుంబంలో చదువుకున్న పిల్లలకి ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని చిన్న పిల్లలైతే వారి చదువులకు అవసరమైన ఆర్థిక సాయం ఇవ్వాలని ఈ సందర్భంగా. రాము. మాట్లాడుతూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం వినుకొండ నియోజకవర్గం కార్యదర్శి పిన్నిబోయిన వెంకటేశ్వర్లు రైతు నాయకులు మద్దికుంట అంకుల్ అడపాల గురుస్వామి తదితర రైతు నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ-సీపీఎం ప్రచార భేరిని జయప్రదం చేయండి

విశాలాంధ్ర-నరసరావుపేట: దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది. ప్రతీ పౌరుడు గొంతెత్తి కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను నిలదీయాలని, ప్రజా వ్యతిరేక నిరంకుశ మతోన్మాద బీజేపీని సాగనంపాలని దేశాన్ని కాపాడుకుందామని ఏప్రిల్ 14 నుంచి 30 వరకు సీపీఐ - సీపీఎం ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా వ్యాప్తంగా జరిగే ప్రచారభేరిని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఏ మారుతి వరప్రసాద్, సిపిఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ లు కోరారు. గురువారం నరసరావుపేట పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సీపీఐ-సీపీఎం నాయకులు ప్రచారభేరి వాల్ పోస్టర్స్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ-అమిత్‌షాలు బిజెపి-ఆర్ ఎస్ ఎస్ కూటమి దేశంలో అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉండవలసిన ప్రజల మధ్య మత విద్వేషపు చిచ్చు రాజేస్తున్నదన్నారు. మరోవైపు ఆదానీ -అంబానీ లాంటి అతి సంపన్నులకు దేశ సంపదను దోచిపెడుతున్నదన్నారు. ప్రశ్నించే రాష్ట్రాలపై ఆయా రాష్ట్ర ప్రభుత్వాల నేతల ఇళ్లపై ఈడి సిబిఐ కేసులతో బెదిరిస్తూ నిరంకుశంగా బిజెపి అణచివేస్తున్నదన్నారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలైనటువంటి ఎల్ఐసి ,బ్యాంకింగ్, రైల్వే, విశాఖ ఉక్కు గనులను కార్పొరేట్లకు అక్రమంగా కట్టబెడుతోందన్నారు పెట్రోల్ డీజిల్ గ్యాస్ అన్ని రకాల నిత్యావసర వస్తువుల ధరలు పెంచి,ప్రజలపై మోయలేని భారాలుమోపుతున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇంత అన్యాయం ద్రోహం చేస్తున్న మోడీ ప్రభుత్వాన్ని రాష్ట్రానికి రావాల్సిన నిధులను గట్టిగా అడిగి నిలదీయలేని దౌర్భాగ్య స్థితిలోకి వైసీపీ ప్రభుత్వం పోయిందన్నారు. ఇటువంటి పరిస్తితుల్లో దేశంలో రాష్ట్రంలో అలుముకుంటున్న చీకట్లనుండి బైటపడటానికి ప్రజానీకమే ఉవ్వెత్తున కదిలి ఉద్యమించాలని అటువంటి మహోద్యమం నిర్మించడానికి వామపక్ష పార్టీలైన సీపిఐ-సిపిఎం ప్రజలను చైతన్యవంతం చేస్తూ ముందుకొస్తున్నాయని తెలిపారు. ఈనెల 14 నుండి 30వ తేదీ వరకు జరిగే ప్రజా చైతన్య యాత్రలను జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, సిపిఎం నాయకులు డి.శివ కుమారి, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ షేక్ సుభాని, సిపిఐ సీనియర్ నాయకులు ఉప్పలపాటి రంగయ్య,సిపిఐ పట్టణ కార్యదర్శి వైదన వెంకట్, సిపిఎం జిల్లా నాయకులు నాగేశ్వరరావు, పెద్దిరాజు, రబ్బాని, బోసు, ఏఐవైఎఫ్ ఏరియా కార్యదర్శి గుండాల శ్రీ హర్ష తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-తాడేపల్లి: తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో గురువారం జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. స్టేషన్ లోని పలు రికార్డులు, సిబ్బంది పని తీరు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ మాట్లాడుతూ డిఎస్పీ,ఎస్సైలతో కలిసి పాత పెండింగ్ కేసులు గురించి అడిగి తెలుసుకోవడం జరిగిందని అన్నారు. సిబ్బంది వెల్ఫేర్ గురించి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అడిగి తెలుసుకున్నామని అలాగే లాంగ్ స్టాండింగ్‌లో ఉన్న సిబ్బంది బదిలీలు గురించి చర్చించడం జరిగిందని తెలిపారు. తాడేపల్లి విఐపి జోన్ కాబట్టి రాత్రిపూట గస్తీ గురించి తెలుసుకున్నామని విజయవాడ దగ్గరగా ఉండటంతో ప్రకాశం బ్యారేజ్, వారధి దగ్గర రాత్రి పూట గస్తీ నిర్వహిస్తామని రాత్రి గస్తీ తిరిగే సిబ్బందికి ఫింగర్ ప్రింట్ స్కానింగ్ డివైసెస్ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. అనుమానితులు ఫింగర్ ప్రింట్స్ తనిఖీ చేయాలని ఆదేశాలు ఇవ్వడం జరిగిందని అన్నారు. ప్రతి రోజు రాత్రి సమయంలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించాలని చెప్పడం జరిగిందని అన్నారు. తాడేపల్లి స్టేషన్‌లో సిబ్బంది కొరత లేకుండా చూస్తాం అని ఎస్పీ అరిఫ్ హఫీజ్ తెలిపారు.

రసధ్వని పుస్తక ఆవిష్కరణ సభ

విశాలాంధ్ర-గుంటూరు: సుప్రసిద్ధ రచయిత డాక్టర్ సంజీవ దేవ్ సాహిత్యం, జీవితంపై ప్రసిద్ధ రచయితలు శ్రీ రమణ, ఎస్ఆర్ తపస్వి, వెనిగళ్ళ వెంకటరత్నంల ద్వారా కూర్పు చేయబడిన 'రసధ్వని' పుస్తక ఆవిష్కరణ సభ 15వ తేదీ సాయంత్రం 5 గంటలకు స్థానిక బృందావన్ గార్డెన్స్ అన్నమయ్య గ్రంథాలయం ధార్మిక విజ్ఞాన ప్రాంగణంలో జరుగుతుందని డాక్టర్ సంజీవ ఫౌండేషన్ కార్యదర్శి యడ్లపల్లి వెంకటేశ్వరరావు తెలియజేశారు. ఈ పుస్తకావిష్కరణ సభకు మనసు ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ మన్నం వెంకటరాయుడు అధ్యక్షత వహిస్తారని శాసనమండలి సభ్యులు కేఎస్ లక్ష్మణరావు పుస్తకావిష్కరణ చేస్తారని, వక్తలుగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్, వరంగల్ ప్రాంతీయ ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్, ఆచార్య లంకా కృష్ణానంద్‌లు పాల్గొంటారని చెప్పారు.

మట్టి నమూనాల సేకరణపై శిక్షణా కార్యక్రమం

విశాలాంధ్ర-పెదకూరపాడు: పెదకూరపాడు మండలం రైతు భరోసా కేంద్రం పెదకూరపాడు-3 నందు గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు నేల ఆరోగ్య పరిరక్షణ, మట్టి నమూనాలు సేకరణపై శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. భూసార పరీక్షలతో భూమిలోని లభ్యమగు స్థూల, సూక్ష్మ పోషకాల స్థాయిని తెలుసుకొని దీని ద్వారా రసాయనిక ఎరువుల వాడకంపై ఖర్చు తగ్గించుకొని అధిక దిగుబడులు సాదించుకొనవచ్చును. అలాగే భూసార పరీక్షల ద్వారా సమస్యాత్మక భూములను గుర్తించి రసాయనికి, సరైన సాగు పద్ధతులు అవలంబించి వాటిని పునరుద్ధరించుసుకొని మంచి దిగుబడులు సాదించవచ్చునని మండల వ్యవసాయ అధికారిణి ఐ.శాంతి తెలిపారు.

దైవ సేవకుల దాతృత్వం

విశాలాంధ్ర-దుర్గి: దుర్గి మండలంలోని గ్లోరీ జీసస్ పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యుడైన జి.యేసురత్నం ఇటీవల అనారోగ్య కార ణంగా సర్జరీ జరగగా, స్థానిక పాస్టర్స్ ఫెలో షిప్ ద్వారా సేవకులు పాస్టర్ యేసు రత్నంను గురువారం పరామర్శించారు. తన ఆరోగ్యం నిమిత్తమై సంపూర్ణ స్వస్థతను దేవుడు అనుగ్రహించాలని స్థానిక ఫెలోషిప్‌లోని సేవకులు ప్రార్థన చేశారు. అలాగే దుర్గి మండలం గ్లోరీ జీసస్ పాస్టర్స్ ఫెలోషిప్ తరపు నుండి ఖర్చుల నిమిత్తమై చిరుగా కానుకను అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు మాగులూరి చంద్రపాల్, ప్రెసిడెంట్ ఎ.జానయ్య, ట్రెజరరీ అన్నారావు, కమిటీ సభ్యులు సీహెచ్ మార్క్, పాస్టర్ పీఏ శామ్యూల్ బాబు, పాస్టర్ ఎజ్రా, పాస్టర్ హోసన్న పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్‌తోనే మాదిగల అభివృద్ధి

విశాలాంధ్ర-కొల్లూరు: ఎమ్మార్పీఎస్ తోనే మాదిగల అభివృద్ధి సాధ్యమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. గురువారం కొల్లూరు మండల పరిధిలోని పెదలంక చింతలంక గ్రామాలలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. హలో మాదిగ చలో చింతలంక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మాదిగలను అక్కున చేర్చుకునే పార్టీలకే తమ మద్దతు ఉంటుందని తెలిపారు. దళిత జాతిని అనగా తొక్కాలి అనుకునే రాజకీయ పార్టీలు కులాలకు మాదిగల ఐక్యతతోనే బుద్ధి చెప్పాలని తెలిపారు. పెదలంక చింతలంక గ్రామాలలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించిన అనంతరం చింతలంక గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. దళితులపై జరుగుతున్న దాడులను కఠినమైన చట్టాలతో అరికట్టాలని కోరారు.

వీవీఐటీలో 'అన్ని మంచి శకునములే' చిత్ర బృందం సందడి

విశాలాంధ్ర-గుంటూరు: సంతోష్ శోభన్, మాళవికా నాయక్ జంటగా స్వప్న సినిమాస్, మిత్ర విందా మూవీస్ పతాకంపై బీవీ నందిని రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'అన్ని మంచి శకునములే', ఈ చిత్రం మే 18వ తేదిన విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర ప్రచారంలో భాగంగా చిత్రబృందం వీవీఐటీ కళాశాలను సందర్శించింది. ఈ కార్యక్రమంలో హీరో సంతోష్ శోభన్, హీరోయిన్ మాళవికా నాయక్, దర్శకురాలు నందినీ రెడ్డి, వీవీఐటీ ప్రిన్సిపాల్ వై.మల్లిఖార్జునరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్శకురాలు నందినీ రెడ్డి మాట్లాడుతూ అలసటతీర్చడానికి, ఆనందం అందించడానికే తాము చిత్రాలు నిర్మిస్తామని అన్నారు. ఈ చిత్రం అన్నివర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని, మంచి కుటుంబ కథా చిత్రంగా రూపొందించామని తెలిపారు. హీరో సంతోష్ శోభన్ మాట్లాడుతూ త్వరలో విడుదల కానున్న ఈ చిత్రానికి మంచి విజయాన్ని అందించాలని కోరారు.

నరసరావుపేటలో కార్డాన్ సెర్చ్

విశాలాంధ్ర-నరసరావుపేట: పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని శ్రీనివాస కాలనీ, షాలింనగర్‌లలో పోలీసులు గురువారం తెల్లవారుజామున కాటన్ సెర్చ్ నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఇంట్లోని వారి వివరాలను, ఇళ్లలోనే వాహనాలను తనిఖీలు చేశారు. డీఎస్పీ విజయ భాస్కర్ రావు ఈ కాటన్ సెర్చ్‌పై మాట్లాడుతూ జిల్లా ఎస్పీ రవి శంకర్ రెడ్డి ఆదేశాల మేరకు వన్ టౌన్, రూరల్ సిఐల ఆధ్వర్యంలో కాటన్ సెర్చ్ నిర్వహించామన్నారు. ఈ కాటన్ సెర్చ్‌లో నంబరు, డాక్యుమెంట్లు లేని 23 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో స్వాధీనం చేసుకున్నామని, అనుమానాస్పందంగా ఉన్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. పట్టణంలో అనుమానాస్పద వ్యక్తులు తిరుగుతున్నందున కాటన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని డీఎస్పీ అన్నారు.

గీతమ్స్‌లో 'నవోదయ మోడల్ టెస్ట్'

విశాలాంధ్ర-వినుకొండ: స్థానిక గీతమ్స్ హైస్కూల్ వారు వినుకొండ పట్టణ మరియు గ్రామీణ ప్రాంత ముల నుండి నవోదయ ఎంట్రన్స్ టెస్ట్ వ్రాయు విద్యార్థుల కు ఎంట్రన్స్ టెస్ట్ పై అవగాహన కలిగించుటకు మోడల్ టెస్టు నిర్వహించారు. మోడల్ టెస్ట్ ఆదివారం ఉదయం 10 గంనుండి 12:30 వరకు జరుగును. నవోదయ టెస్టు రాస్తున్న విద్యార్థినీ విద్యార్థులు ఈ చక్కని అవకాశాన్ని విని యోగించు కోవలసినదిగా పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయిం చుకావాలని తెలిపారు. ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు చరవాణి: 7013800787. రిజిస్ట్రేషన్ ఆఖరితేది. 15-04-2023. విద్యార్థినీ విద్యార్థులు త్వరగా రిజిస్ట్రేషన్ చేయించుకొని. ఈ సదావకాశాన్ని వినియోగించుకోగలరు. రిజిస్ట్రేషన్ ఫీజు. 10/చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకొనగలరు.

మజ్జిగ పంపిణీ అభినందనీయం

విశాలాంధ్ర-రెంటచింతల: అధిక ఉష్ణోగ్రత నమోదు కేంద్రంగా పేరొందిన రెంటచింతలలో మజ్జిగ, మంచినీరు పంపిణీ చేయటం అభినందనీయమని స్థానిక ఎస్సై సమీర్ భాషా అన్నారు. గురువారం స్థానిక ఫ్రెండ్స్ ఇన్ నీడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ కేంద్రాన్ని ఎస్సై ప్రారంభించారు. ప్రతి ఏటా చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చుతున్న సేవాసంస్థ అధ్యక్షుడు పేరం చెన్నారెడ్డి కృషిని ఎస్సై భాషా అభినందించారు. మజ్జిగ దాత ఇగుటూరి సత్యనారాయణరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో దుర్గి యార్డు డైరక్టరు వెన్నా వెంకటేశ్వరరెడ్డి, వెన్నా లింగారెడ్డి, పోట్ల రామకృష్ణ, ఇగుటూరి నరేంద్రరెడ్డి పలువురు నేతలు పాల్గొన్నారు.

జియో వద్దు బాబోయ్

విశాలాంధ్ర-తాడేపల్లి: రోడ్డుకి ఒకవైపున కరెంట్ పోల్స్, ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్ పోల్స్, ప్రైవేట్ కంపెనీలకు సంబంధించిన నెట్‌వర్క్‌లు ఉండటంతో ప్రతి నెల కరెంటు తీగలకు అడ్డు వస్తున్నాయని నెపంతో చెట్లను అడ్డంగా నరికివేస్తున్నారు. ఇళ్ళ ముందు పెంచుకున్న చెట్లను, వాటి కొమ్మలను నరికినప్పుడల్లా పర్యావరణ ప్రేమికులు తల్లడిల్లిపోయి ప్రత్యామ్నాయంగా రోడ్డుకు మరొక ప్రక్కన వృక్షాలను పెంచి పర్యావరణాన్ని కాపాడుతున్నారు. మండుటెండల్లో సైతం పాదచారులు ఆ చెట్ల నీడనే సేదతీరుతున్నారు. అయితే మున్సిపల్ అధికారుల అనుమతి ఉందని అందరూ వెళ్లే దారిలో మేము వెళ్ళమని మాకు సపరేట్ లైన్స్ కావాలని తాడేపల్లి మండల పరిధిలోని ఉండవల్లి సెంటర్లోని కోల సుబ్బారావు రోడ్‌లో జియో అధికారులు మార్కింగ్‌లు వేసి గోతులు తవ్వి చెట్లను నరుకుతుండగా స్థానికులు అడ్డుకున్నారు. అభివృద్ధికి తాము ఆటంకం కలిగించమని, 99 శాతం నెట్‌వర్క్ ప్రొవైడర్లు వాడుతున్న లైన్లను వాడుకొని తమకు కనెక్షన్లు ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో తమకు ఎవరికీ జియో కనెక్షన్లు వద్దని, తమ చెట్లను, కొమ్మలను నరకొద్దని జియో ప్రతినిధులతో వాగ్వాదానికి దిగారు. సకాలంలో మున్సిపల్ అధికారులు స్పందించి, తవ్విన గుంటలను పూడ్చి జియో అధికారులను అక్కడ నుంచి పంపించి వేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. రోడ్డుకి ఒకవైపునే పోల్స్‌ని పాతుకొని కనెక్షన్లను ఇప్పించాలని మున్సిపల్ అధికారులను కోరారు.

స్థలం ఒరిజినల్ డాక్యుమెంట్లు పోయినవి

షేక్ ఇస్మాయిల్, తండ్రి సైదులు అను నేను పల్నాడు జిల్లా, వెల్దుర్తి మండలం, సిరిగిరిపాడు గ్రామ నివాసినై యున్నాను. అయితే నేను హక్కుదారుడిగా ఉన్న డాక్యుమెంట్ **నెంబర్ 2762/1929** గల ఏడు సెంట్ల భూమికి సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్లు, గత **నెల 28వ** తేదీన మాచర్ల నుండి సిరిగిరిపాడుకు ఆటోలో వస్తుండగా నాకు సంబంధించిన డాక్యుమెంట్లు కనబడకుండా పోయినవి. అంత వెతికినను కనిపించడం లేదు. ఎవరికైనా దొరికిన యెడల సెల్ **9848329985** నెంబరుకు కాల్ చేసి చెప్పగలరు.

మా నమ్మకం నువ్వే జగన్‌పై వెల్లువెత్తిన ప్రజాభిప్రాయం

విశాలాంధ్ర-బాపట్ల టౌన్: ప్రస్తుత పరిపాలనపై రాష్ట్ర ప్రభుత్వం చేపట్టినటువంటి మా నమ్మకం నువ్వే జగన్ భాగంగా స్థానిక 25 వ వార్డు విజయలక్ష్మిపురం నందు వైసిపి కోఆర్డినేటర్ ఆదిలక్ష్మి నేతృత్వంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చినటువంటి హామీలలో 98 శాతం పూర్తి చేయటం ఏ రాష్ట్రంలోనూ లేదని జగన్ పరిపాలనపై హర్షం వ్యక్తం చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నిటిని కాకుండా నిరుపేదలకు అవసరమైన అవసరాన్ని కూడా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి గుర్తించి పరిష్కరించడం ఏ ప్రభుత్వంలోని జరగలేదని ప్రజలు చెప్పడం మొదటిసారి అని ఆదిలక్ష్మి అభిప్రాయపడ్డారు. ప్రతి ఇంటిలోనూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు, విద్య కానుకలు, ఆరోగ్యశ్రీ సేవలు ప్రభుత్వ బాధ్యతను ప్రజలు గుర్తించారని వైసిపి నాయకులు కర్లపాలెం కిషోర్ బాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు అందరూ కూడా పాల్గొన్నారు.

కర్లపాలెంలో 'చెత్త' రాజకీయం

- ప్లాట్ల అమ్మకాల కోసం అధికార పార్టీ నేతల తంటాలు
- వెంచర్ ఎదురు ఉన్న చెత్త తొలగింపునకు కొత్త ఎత్తుగడ
- అంబేద్కర్ నిర్మాణం అంటూ దళితులతో ప్రెస్‌మీట్
- రైతుల పొలాల్లో చెత్త పోయద్దంటూ సీపీఐ, రైతుల ఆందోళన

విశాలాంధ్ర బ్యూరో-బాపట్ల: కర్లపాలెంలో చెత్త రాజకీయం జరుగుతోంది. కర్లపాలెం పంచాయితీ జాతీయ రహదారి పక్కన ఓ స్థిరాస్థి వ్యాపారి వేసిన వేంచర్‌లో ప్లాట్లు అమ్మకం కోసం అధికార పార్టీ నేతలు ఎంతైన తెగిస్తున్నారు. వెంచర్ ఎదురుగా ఉన్న డంపింగ్ యార్డులో చెత్తను తొలగించి చింతాయపాలెం రెవిన్యూ పరిధిలో 14 గ్రామాలకు చెందిన పంటపొలాలు రెండు గ్రామలకు చెందిన తాగునీటి ప్రధాన చెరువుల రాత్రికి రాత్రే డంపింగ్ యార్డులో చెత్తను తీసుకువచ్చి పోశారు. దీంతో రైతులు,సీపీఐ నాయకులు ఆందోళన వ్యక్తం చేసి కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ నేపధ్యంలో అధికారులు విచారణ చేస్తున్న సమయంలో కర్లపాలెం అంబేద్కర్ సేవా సమాజం గురువారం సాయంత్రం ప్రెస్‌మీట్ పెట్టి బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి అంబేద్కర్ భవన నిర్మాణం చేపడతారని ఇక్కడ ఉన్న చెత్త వ్యర్థాలు తొలగించాలని చెపుకొచ్చారు. టీడీపీ ప్రభుత్వం అప్పటి ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ కర్లపాలెంలో అంబేద్కర్ భవనానికి పునాదులు వేసి బేస్మెంట్ వరకు నిర్మాణం చేపట్టారు. ప్రభుత్వం మారటంతో నిర్మాణం ఆగిపోయింది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ అటు వైపు కనీసం కన్నెత్తి చూడని అధికార పార్టీ నేతలు, అంబేద్కర్ సేవా సమాజం సభ్యులు ఉన్నట్లు ఉండి హఠాత్తుగా ఇక్కడ ఉండే చెత్తను తొలగించండి ఎమ్మెల్యే కోన రఘుపతి ఏడాదిలో భవనం పూర్తి చేస్తాడని ప్రకటించటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారంలోకి వచ్చి 4 ఏళ్లు గడుస్తున్నా అంబేద్కర్ భవనం గురించి పట్టించుకోకుండా వేంచర్‌లో ప్లాట్లు అమ్మకం కోసం ఎమ్మెల్యే కోన రఘుపతికి ఇప్పుడు అంబేద్కర్ భవన్, దళితులు గుర్తుకు వచ్చారా.. ప్లాట్ల అమ్మకం కోసం దళితులతో కలిసి వేసిన రాజకీయ ఎత్తుగడే అని ప్రజలు ఆరోపిస్తున్నారు. నిజంగా దళితుల పట్ల చిత్తశుద్ధి ఉంటే రైతులకు ఇబ్బంది లేకుండా చెత్తను తొలగించి అంబేద్కర్ భవన నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. కేవలం ఒక వ్యక్తికి లబ్ది చేకూర్చేలా మాత్రం ఎమ్మెల్యే కోన ప్రవర్తిస్తే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరిస్తున్నారు.

పొలాల్లో చెత్త పోస్తే ఆత్మహత్యే గతే

విశాలాంధ్ర-కర్లపాలెం: పచ్చనిపొలాల మధ్య చెత్త పోస్తే మా జీవనాధారం లేకుండా పోతామని ఆత్మహత్యే మాకు గతి అని రైతులు తెలిపారు. రాళ్ల చెరువు పక్కన పొలాల్లో పోస్తున్న చెత్తను తొలగించాలంటూ రైతులు సీపీఐ పార్టీ నాయకులు పలు విధాలుగా ఆందోళన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతుల నోట్లో రియల్టర్ చెత్త శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ నేపధ్యంలో తహశీల్దారు కేశవనారాయణ, ఈవోపీఆర్డీ శరత్‌బాబులు గురువారం సాయంత్రం రైతులతో సమావేశమైయ్యారు. పొలాల్లో అర్ధరాత్రులు వేసిన చెత్తను తొలగించాలని రైతులు కోరారు. అదేవిధంగా డంపింగ్ యార్డు ఏర్పాటును విరమించుకోవాలన్నారు. తహశీల్దారు కేశవనారాయణ పొలాల మధ్య చెత్తను వేయరాదని పంచాయితీ సిబ్బందికి తెలిపారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ మాట్లాడుతూ కాసుల కోసం కక్కుర్తి పడి అన్నం పెట్టే రైతులను ఇబ్బందులు పెట్టడం మంచి పద్దతి కదన్నారు. ఒక వ్యక్తికి సంబంధించిన వేంచర్‌లో ప్లాట్లు అమ్మకం కోసం 14 గ్రామాలకు వెళ్లే సాగునీటి కాలువ పక్కన చెత్త వ్యర్థాలు ఏలా తరలిస్తారని ప్రశ్నించారు. అధికారులు డంపింగ్ యార్డు నిర్మాణం ఆపి పొలాల్లో వేసిన చెత్తను తొలగించకుంటే వ్యవసాయ నల్లచట్టాలకు వ్యతిరేఖంగా కేంద్రంతో పోరాడిన రైతుల స్ఫూర్తితో కర్లపాలెంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిట్లు కాసులరెడ్డి, ఆట్ల శివచలమారెడ్డి, కొండమూది మునియ్య, కొండమూది సుబ్బారావు, ఆట్ల వెంకటేశ్వర్లు రెడ్డి, దొంతిబోయిన శివారెడ్డి, శ్రీనివాసరెడ్డి , ఆట్ల రాంబాబురెడ్డి, షేక్ యానాదిసాహేబ్ తదితరులున్నారు.

నైపుణ్యంతో అవకాశాలు పొందాలి

విశాలాంధ్ర-వేటపాలెం : కార్పొరేట్ రంగం విస్తరణతో అవకాశాలు మెండుగా ఉన్నాయని అయితే వాటిని దక్కించుకోవడానికి కావలసిన నైపుణ్యాలు లేకపోవడం వలన అనేక మంది విద్యార్థులు నిరుద్యోగులుగా మిగులుతున్నారని చీరాల ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రవికుమార్ పేర్కొన్నారు. సీఎస్ఈ ఈసీ సీనియర్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం గురువారం చీరాల ఇంజనీరింగ్ కళాశాలలో జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ చదివి బయటికి వెళ్లిన విద్యార్థుల్లో కొందరు లక్షల్లో జీతాలు తీసుకుంటుండగా మరికొందరు వేలల్లో, ఇంకొందరు నిరుద్యోగులుగా ఉంటున్నారు. సీఈసీలో నైపుణ్యం కలిగిన అధ్యాపకులు, అత్యంత సాంకేతిక పరిజ్ఞానం కలిగిన కంప్యూటర్ ల్యాబ్లు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. కళాశాలనే ఒక ప్రయోగశాలగా మార్చుకుని తమ జీవితాన్ని ఉన్నతంగా మలుచుకోవాలని చెప్పారు. కళాశాల నుంచి బయటకి వెళ్లే ప్రతి విద్యార్థికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక శిక్షణను ఇస్తున్నట్లు తెలిపారు. వివిధ పోటీలలో బహుమతులు సాధించిన విద్యార్థులకు, మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు, పతకాలు, అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో హెచ్ఓడిలు డాక్టర్ సౌజన్య, డాక్టర్ బషీరా, డాక్టర్ శ్రీకాంత్, ప్రకాష్ రాజ్, సూర్యనారాయణ, ప్లేస్ మేట్ ఆఫీసర్ బాజీ, విద్యార్థులు సహాయ ఆచార్యులు పాల్గొన్నారు.

ఇంకొల్లు సభ విజయవంతం చేయండి

విశాలాంధ్ర-యద్దనపూడి: నవ భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 132వ జయంతిని పురస్కరించుకొని ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఇంకొల్లులో జరగనున్న జై భీమ్ జై తెలుగుదేశం బహిరంగ సభను విజయవంతం చేయాలని మండల టిడిపి అధ్యక్షులు నల్లపనేని రంగయ్య చౌదరి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల నుండి అన్ని వర్గాల ప్రజలు, మేధావులు, ప్రముఖులు ప్రజాస్వామ్యవాదులు హాజరుకావాలని అన్నారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని జరిగే సంబరానికి పెద్ద ఎత్తున తరలి రావాలని అంబేద్కర్ ఆశయాలు, ఆయన రచించిన హక్కులను సాధించుకునేందుకు ప్రతి ఒక్కరూ కంకణ బుద్ధులవుదాం,అరాచక ప్రభుత్వాన్ని గద్దించి హక్కులను సాధించుకుందా అని అన్నారు. ఈ కార్యక్రమంలో కనపర్తి నాగేశ్వరరావు , రాయపాటి సీతయ్య, గుదే తారక రామారావు, కొరటాల వంశీకృష్ణ కోయ సతీష్ , ఈరపనేనివాసు షేక్ బాజీ, సూరిశెట్టి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానిది దోచుకో...దాచుకో నినాదం

విశాలాంధ్ర-కొరిశపాడు: దోచుకో...దాచుకో...పంచుకో నినాదంతో వైసీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. మండలంలోని తమ్మవరం గ్రామంలో అనుమతులు లేకుండా డ్రెజ్జర్ల సహాయంతో ఇసుకను తోడుతున్న నది పరివాహక ప్రాంతాన్ని టీడీపీ నాయకులు, స్థానికులతో కలిసి ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే క్షేత్రస్థాయి పరిశీలనకు వస్తున్నారన్న ముందస్తు సమాచారంతో పనులు నిలిపివేసి అందుబాటులో లేకుండా అక్కడ నుంచి వెళ్లిపోయారు. అవగాహన లేని ముఖ్యమంత్రి పాలనతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారని అధికారం వచ్చిన నాటి నుండి నేటి వరకు వైసీపీ నాయకులు జేబులు నింపుకునే పనిలో నిమగ్నమై ఉండటం వల్ల ప్రజలకు ఈ దుస్థితి నెలకొందని గొట్టిపాటి విమర్శించారు. వైసీపీ నేతల కనుసనల్లోనే భారీ డ్రెజ్జర్లతో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నామని ఇందుకేనా జగన్ రెడ్డిపై నమ్మకం ఉంచుకోవాలా అంటూ ఎద్దేవా చేశారు. రైతులు వారి పంటలు కాపాడుకునేందుకు మీ అనుమతి లేకుండా నీటి చుక్కను వాడిన ఆగమేఘాల మీద కేసులు బనాయించి ఇబ్బందులు గురి చేసే మీరు నేడు ఎవరి ప్రోద్భలంతో మిన్నకుండారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇలాంటి చర్యల వలన ప్రాజెక్టు దెబ్బతినే ప్రమాదం ఉందని వెంటనే వాహనాలు ఇక్కడనుండి తరలించేలా చర్యలు చేపట్టాలని లేనిచో ప్రజలకు మద్దతుగా జాతీయ రహదారి దిగ్బంధం చేసేందుకు వెనుకాడబోమని ఎమ్మెల్యే ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో గుండ్లకమ్మ పరివాహ ప్రాంతం ప్రజలు, పార్టీ నియోజకవర్గ స్థాయి నాయకులు పాల్గొన్నారు.

నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

విశాలాంధ్ర-నిజాంపట్నం: నాటు సారా విక్రయిస్తున్నారన్న సమాచారంతో నగరం స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అధికారులు గురువారం దాడులు నిర్వహించారు.నగరం సెబ్ సీఐ దేవర శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది నిజాంపట్నం మండలం పరిశావారిపాలెం గ్రామంలో నాటు సారా విక్రయిస్తున్న శొంఠి నాగరాజును అదుపులోకి తీసుకున్నారు.నాగరాజు వద్ద రెండు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సిఐ తెలిపారు.

జగన్ చిత్రపటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర-రొంపిచర్ల: స్థానిక చెరువుకట్ట సెంటర్‌లో గురు వారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముఖ్య మంత్రి జగన్ చిత్రపటానికి పాలా భిషేకం కార్యక్రమం జరిగింది. బీసీ కులగణనను అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిన సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుతూ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీసీ సంక్షేమ సంఘం మండల నాయకులు, కార్యకర్తలు బీసీల ఐక్యత వర్ధలాల్లి, జై జగన్ అంటూ నినాదాలు చేశారు. బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు గాలి సాంబశివరావు, బీసీ సంక్షేమ సంఘం మండల నాయకులు ముక్కదాల వెంకటేశ్వరరావు, చక్రవరం సత్యనారాయణరాజు, ముక్కదాల శ్రీనివాసరావు, ఉప్పలపాటి వెంకటేశ్వర్లు, అంజిబాబు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ గుంటూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఆకిటి, మేడా

విశాలాంధ్ర-గుంటూరు: ఏఐటీయూసీ 16వ మహా సభలలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఏఐ టీయూసీ జిల్లా అధ్యక్షులుగా ఆకిటి అరుణ్‌కుమార్, కార్య దర్శిగా మేడా హను మంతరావులతో పాటు 49 మంది సభ్యులతో నూతన సమితి, 21 మందితో నూతన కార్యవర్గం, 11 మంది ఆఫీస్ బేరర్స్‌ను మహాసభ ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు ఆకిటి అరుణ్‌కుమార్, మేడా హనుమంతరావులు మాట్లాడుతూ మంగళగిరి పట్టణంలో ఈ నెల 12వ తేదిన జరిగిన ఏఐటీయూసీ గుంటూరు జిల్లా 16వ మహాసభలు విజయ వంతంగా ముగిశాయన్నారు. మహాసభల సందర్భంగా కార్మిక ప్రదర్శన ఉత్సాహంగా జరిగిందని, అనంతరం ప్రతినిధుల సభ నిర్వహించినట్లు తెలిపారు. మహాసభలో పలు తీర్మానాలు ఆమోదించడం జరిగిందని, దేశ ప్రధాని నరేంద్ర మోదీ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను, అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్ శక్తులకు భారతదేశాన్ని దోచిపెడుతున్న మోదీ నయవంచనని ఎండగడుతూ 'కార్మిక గర్జన' పేరుతో మేడే కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించాలని మహాసభ నిర్ణయించినట్లు వెల్లడించారు.

సెలవు రోజుల్లోనూ క్యాష్ కౌంటర్లు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ఆస్తి పన్నును ఏక మొత్తంగా ఏప్రిల్ నెలాఖరులోపు చెల్లించే వారికి మొత్తం పన్నుపై 5 శాతం రాయితీ లభిస్తుం దని, పన్ను చెల్లింపుదారులకు వీలుగా సెలవు రోజుల్లోనూ క్యాష్ కౌంటర్లు పని చేస్తాయని నగర కమిషనర్ కీర్తి చేకూరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పన్ను చెల్లించి పన్ను రాయితీని వినియోగించుకోవాలని కోరారు.

కారం, పసుపు తయారీ కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-దుగ్గిరాల: రైతుల ఆదాయం సమకూరే విధంగా పొడి చేసే యంత్రాలను ప్రారంభించడం జరిగిందని కేంద్ర గిడ్డంగుల సంస్థ ఎండీ అమిత్ కుమార్ సింగ్ అన్నారు. మండల కేంద్రమైన దుగ్గిరాల రైలుపేటలో కేంద్ర గిడ్డంగుల సంస్థలో గురువారం ప్రాజెక్టుగా ఎంపిక కాబడిన పసుపు, కారం పొడి తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా కేంద్ర వేర్ హౌస్ ఎండీ అమిత్ కుమార్ సింగ్ హాజరై ప్రారంభించారు. అనంతరం రైతులు, వ్యాపారస్తులతో మాట్లాడి తదుపరి ప్రాజెక్టుకు స్థలాన్ని శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. రిబ్బన్ కట్ చేసి పసుపు తయారీ యంత్రాలను పరిశీలించారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, మేనేజర్ అజయ్ చాదు, కె.పద్మజ, జ్ఞాన పాండే, సంతోష్ కుమార్, భరద్వాజ్, ప్రశాంత్ కుమార్, జయప్రసాద్, నారాయణ, తోడేటి జాన్సన్ పాల్గొన్నారు.

పెన్షన్ కోసం దివ్యాంగుడి వేడుకోలు

విశాలాంధ్ర-మంగళగిరి: సదరం సర్టిఫికేట్లో 90 శాతం అంగవైకల్యం ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పెన్షన్ మంజూరుకు ఒక్క శాతం కూడా ప్రయత్నం చేయడం లేదని దివ్యాంగుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని చినకాకాని గ్రామ సచివాలయం అధికారిని వద్దకు వెళ్తే మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంకు వెళ్ళమని... ఇక్కడికి వస్తే తిరిగి సచివాలయానికే వెళ్ళమని అంటున్నారని వాపోయాడు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పెన్షన్ అనేది ఆ దివ్యాంగుడికి అందని ద్రాక్షలా మిగిలిపోయింది. రెండేళ్ళ నుంచి గ్రామ సచివాలయం చుట్టూ ఒంటికాలుతో తిరుగుతున్నా నేటికి మంజూరుకు నోచుకోలేదని, అంగవైకల్యం కలిగిన తాను ఎంత వరకు తిరగగలని అధికారులు అర్థం చేసుకుని పెన్షన్ మంజూరుకు కృషి చేయాలని కోరుతున్నాడు.

కార్డియాక్ అరెస్ట్‌పై అప్రమత్తత అవసరం

విశాలాంధ్ర-గుంటూరు : కార్డియాక్ అరెస్ట్‌పై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని రమేష్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరక్టర్, చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పి.రమేష్‌బాబు అన్నారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని డీన్ ప్రమోషన్స్, కొలాబరేషన్స్, ఫ్యాకల్టీ అఫైర్స్ ఆఫీస్ ఆధ్వర్యంలో 'హార్ట్ డిసీజెస్ : ఆరిజన్ అండ్ ప్రివెన్షన్' అనే అంశంపై అధ్యాపకులతో పాటు ఇతర సిబ్బందికి అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ రమేష్‌బాబు మాట్లాడుతూ ఆధునిక జీవితంలో మద్యం, ధూమపానం, ఫాస్ట్‌ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం, వంశ పారంపర్యం, గ్యాస్ట్రిక్ సమస్యలు, ఒత్తిడి వంటి కారణాలతో ఎక్కువ మంది గుండె జబ్బుల బారిన పడుతున్నారని వివరించారు. మొదట్లోనే వీటిని గుర్తించి జాగ్రత్తలు తీసుకోవడం వల్ల రాబోవు ముప్పును నివారించుకోవచ్చని తెలిపారు. కార్డియాక్ అరెస్టు సంభవించినప్పుడు మెదడుకు రక్తప్రసరణ ఎంతో ముఖ్యమని చెప్పారు. గోల్డెన్ సమయంలో చికిత్సను అందించడం ద్వారా వ్యక్తి ప్రాణాల్ని ఏ విధంగా కాపాడవచ్చో వివరించారు. ముందుగా గుర్తించినట్లయితే 98 శాతం కార్డియాక్ అరెస్ట్‌లను నివారించవచ్చునని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.

మా నమ్మకం నువ్వే జగనన్నకు విశేష స్పందన

విశాలాంధ్ర-ఫిరంగిపురం: మానమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని నుదురుపాడు గ్రామంలో జరిగింది. గ్రామ సర్పంచ్ గొట్టం నాగ మల్లేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జడ్పిటీసి దాసరి కత్తిరేణమ్మ ముఖ్య అతిథిగా హాజరై మండల, గ్రామ నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందిస్తున్న అనేక సంక్షేమ పథకాల గురించి ఆరా తీసి పథకాల గురించి వివరించారు. జగననన్నే మాభవిష్యత్- మానమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమానికి ప్రజల నుంచి విశేషమై స్పందన రావడం సంతోషదాయకమన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్ననే ముఖ్యమంత్రిగా గెలుపించుకోవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో అప్పిరెడ్డి, ఐలా సుధాకర్‌రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇనుప సామాను కొట్టు దగ్ధం

విశాలాంధ్ర-ఫిరంగిపురం: మండలంలోని బేతపూడి గ్రామంలో ఇనుప సామాన్‌ల కొట్టు దగ్ధమైన సంఘటన గురువారం సాయంత్రం జరిగింది. బాధితుడు గ్రామానికి చెందిన సయ్యద్ బాజీ తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో ఇనుప సామాన్‌ల హోల్‌సేల్ షాపు వ్యాపారం చేసుకొని కుటుంబంతో జీవిస్తున్నాడు. బాజీ ఎప్పటిలాగానే పాత ఇనుప సామాన్లు కొనుగోలు చేసుకుంటూ షాపు తీసి ఉంచాడు. గుర్తు తెలియని వ్యక్తులు కావాలనే తన షాపుకు నిప్పంటించారని బాధితుడు వాపోయాడు. తన షాపులో పది లక్షల రూపాయలుకు పైగా సరుకు ఉందని సరుకంతా అగ్నికి ఆహుతయ్యిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం నుంచి తమకు సహాయం అందించి తన కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితుడు కోరారు. బాజీ కుటుంబానికి నష్టం కల్గించిన దుండగులను పోలీసులు పట్టుకొని న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. సమాచారం తెలుసుకున్న సత్తెనపల్లి అగ్నిమాపకదళ సిబ్బంది మంటలను ఆర్పి చుట్టు ప్రక్కల నివాస ప్రజలకు నష్టం జరగకుండా మంటలను అదుపు చేసి కృషి చేశారు. అదేవిధంగా రెవిన్యూ అధికారులు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆస్తి నష్ట వివరాలు సేకరిస్తున్నారని గ్రామస్తులు చెప్పారు.

హెరిటేజ్ డైరీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-శావల్యాపురం: హెరిటేజ్ డెయిరీ ద్వారా అందిస్తున్న సేవలను పాడి రైతులంతా సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధిని సాధించాలని రీజినల్ మేనేజర్ ఎం.వరప్రసాద్ అన్నారు. మండలంలోని కనమర్లపూడి గ్రామంలోని పాడి రైతులకు హెరిటేజ్ డైరీ సేవలపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన పోట్లూరి దుర్గా శ్రీనివాసరావు, పేరం వెంకటేశ్వరరెడ్డిలకు చెందిన పశు వులు ప్రమాదవశాత్తు ఇటీవల మృతి చెందగా వారు ఇరువురికి రూ.50వేలు విలువైన ప్రమాద భీమా చెక్కులను పంపిణీ చేశారు. రీజినల్ మేనేజర్ వరప్రసాద్ మాట్లాడుతూ హెరిటేజ్ డెయిరీకి పాలుపోసే ఉత్పత్తిదారులందరికీ డెయిరీ తరపున రూ.2 లక్షల ప్రమాదభీమా పథకాన్ని వర్తింపజేయడం జరుగుతుందని, గేదెలకు ప్రమాదభీమా, రాయితీలపై పశువుల దాణాలను అందజేయడం జరుగుతుందని తెలిపారు. సంస్థ మేనేజర్ చింతా శ్రీనివాసరావు, చల్లగుండ్ల డైరీ మేనేజర్ పెంట్యాల సుధాకర్, మధు సూధనరావు, సూపర్వైజర్ అల్లు వెంకట రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర బాపట్ల జిల్లా

అంగన్‌వాడీ కార్యకర్తలకు నియామక పత్రాలు

విశాలాంధ్ర-అద్దంకి: కొరిశపాడు ఐసిడిఎస్ పరిధిలో నూతనంగా ఎంపి కైన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా లకు గురువారం స్థానిక రహదారుల అతిథిగృహం వద్ద జరిగిన కార్య క్రమంలో శాప్‌నెట్ చైర్మన్ నియోజక వర్గ వైసీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య నియామకపత్రాలను అందజేశారు. సిడిపిఒ కృష్ణకుమారి, సూపర్‌వైజర్లు పద్మావతి, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

జగనన్న గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

విశాలాంధ్ర-అద్దంకి: జగనన్న కాలనీ లలో గృహ నిర్మాణాలను వేగవం తంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య గృహ నిర్మాణశాఖ అధికారులకు సూచించారు. గురు వారం స్థానిక రహదారుల అతిథిగృహం వద్ద జగనన్న కాలనీల గృహ నిర్మాణాలపై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. కార్యక్రమంలో గృహ నిర్మాణశాఖ పిడి ప్రసాద్, డిఈ దాశరధిశర్మ, ఏఈలు, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

కలసికట్టుగా టీడీపీ విజయానికి కృషి చేయాలి

విశాలాంధ్ర-అద్దంకి: అందరూ ఐక మత్యంతో ఉంటూ కలసికట్టుగా వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ విజయా నికి తోడ్పాటునందించాలని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురు వారం చిలకలూరిపేటలోని ఎమ్మెల్యే స్వగృహంలో అద్దంకి పట్టణ నాయీబ్రాహ్మణ సంఘ సభ్యులు ఎమ్మెల్యే రవి కుమార్‌ను కలిశారు. సంఘ నాయకులు అద్దంకి ఏడుకొండలు, గుడిపాటి శ్రీను, బాపయ్య,తాళ్ళూరి గాంధీ, గుడిపాటి నాగేశ్వరరావు, పోలవరపు శ్రీను, జాగర్లమూడి శ్రీనివాసరావు, దేవరపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

విశాలాంధ్ర-చీరాల: విధినిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కమీషనర్ రామచంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలో 25 సచివాలయాల అడ్మిన్లతో గురువారం కమిషనర్ రామ చంద్రారెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయాల అడ్మి న్లకు కమిషనర్ పలు సూచనలు చేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసే విష యంలో వాలంటరీలు నిబద్ధతను కలిగివుండాలని చెప్పారు. సమయానికి సచివాల యాలకు రాకుండా ఇష్టానుసారంగా వ్యవహరించే వాలంటరీలని తొలగిస్తామని స్పష్టం చేశారు. సచివాలయాలకు వచ్చే ప్రజల ఇబ్బందులు పెట్టకుండా వారి సమస్య లను సకాలంలో పరిష్కరించాలన్నారు. సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులు, వాలంటరీలు సమన్వయంతో పనిచేసి చీరాల మున్సిపాలిటీకి మంచిపేరు తీసుకు రావాలన్నారు. వార్డుల అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోషకాలతో రాగిజావ

విశాలాంధ్ర-జె.పంగులూరు: విద్యా ర్థులకు పోషకాలు కలిగిన రాగి జావను అందిస్తున్నట్లు కొండమం జులూరు గ్రామంలోని ప్రాథమిక పాఠ శాల ప్రధానోపాధ్యాయులు పాలపర్తి తిరుపతయ్య తెలిపారు. పాఠశాలలో 74 మంది విద్యార్థులు ఉన్నారని, కొందరు గైర్హాజరు అయినట్టు తెలిపారు. తల్లితండ్రులు పనుల కోసం వలస పోవటం ద్వారా, పాఠశాలలకు విద్యార్థులు రాలేకపోతున్నట్టు తెలిపారు. పాఠశాలకు వచ్చే ప్రతి విద్యార్థికి 10 గంటల సమయంలో రాగిజావను ప్రతి ఒక్కరికీ ఒక గ్లాసు చొప్పున అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అంది స్తున్నామని, మంచి ఆహారం కూడా అందిస్తున్నామని తెలిపారు.

పెన్నులు, ప్యాడ్ల పంపిణీ

విశాలాంధ్ర-కొరిశపాడు: మేదరమెట్ల గ్రామంలో బీసీ వసతి గృహం నందు జ్యోతిరావు పూలే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ప్యాడ్లు పెన్నులు పంపిణీ చేయడం జరిగింది తొలుత మహనీయుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు మొండ్రు ఆంజనేయులు పాల్గొని మాట్లాడారు. జ్యోతిరావు పూలే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పోరాట ప్రతిమ ఉద్యమ స్ఫూర్తి ఫలితంగా నేడు వారి ఫలాలను పొందుతున్నామని అన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వలన రిజర్వేషన్ల ద్వారా బడుగు బలహీన వర్గాల విద్యార్థులు చదువుల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆంజనేయులు కోరారు ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక సభ్యులు సర్దార్ ఖాన్ ఆలీబాబా పేరం సతీష్ బాబు, లక్ష్మణ్ స్వామి గౌడ్ హాస్టల్ వార్డెన్ వెంకటరావు చిన్న హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

సూపర్‌వైజర్ల పెత్తనం నిలిపివేయాలి

విశాలాంధ్ర-చీరాల: పారిశుధ్య కార్మి కులపై సూపర్‌వైజర్ల పెత్తనం నిలిపి వేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోటి దాసు తెలిపారు. పారిశుధ్య కార్మికుల పలు సమస్యలను పరిష్కరిం చాలని కోరుతూ చీరాల మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం పారిశుద్ధ్య కార్మికులు నిరసన ప్రదర్శన చేపట్టారు. సమస్యలను వెంటనే పరిష్కరిం చాలంటూ నినాదాలు చేసి అనంతరం కమిషనర్ రామచంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కోటిదాసు మాట్లాడుతూ చీరాల పట్టణాన్ని పరిశుభ్రతతో నింపే పారిశుద్ధ కార్మికులపై ఉన్నతాధికారులు చిన్నచూపు విడనాడాలన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు కాలయాపన చేయడం మంచి పద్ధతి కాదన్నారు. సమస్యలన్నిటిని వెంటనే అధికారులు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు మాల్యాద్రి, శ్రీనివాసరావు, నిర్మల, సుబ్బరాయుడు, మేరమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీపీ మండల్‌కు ఘన నివాళి

విశాలాంధ్ర-భట్టిప్రోలు: బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీ కులాల ఆరాధ్య దైవం బీపీ మండల్ వర్ధంతిని మండలంలోని ఐలవరంలో గురు వారం నిర్వహించారు. సంక్షేమం సం ఘం బాపట్ల జిల్లా ఉపాధ్యక్షులు జొన్నాదుల వెంకటేశ్వరరావు. జిల్లా కార్యదర్శి ఈడె శ్రీనివాసరావు స్థానిక ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద బిపి మండల్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అన్ని ప్రభుత్వ విద్యా సంస్థల్లో వెనుకబడిన అభ్యర్థులకు రిజర్వు సీట్లను నిష్పత్తి ప్రకారం కేటాయించిలని బీపీ మండల్ సిఫార్సు చేసిన విషయాన్ని గుర్తు చేసుకుంటూ ఆయన సేవలను కొని యాడారు. బీసీ నాయకులు, ఎన్‌టిఆర్ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.